క్లుప్తంగా

సీతారాముల కల్యాణానికి తలంబ్రాలు తయారు



తలంబ్రాలను తయారు చేస్తున్న ఆర్యవైశ్య మహిళలు

వేంపల్లె : భద్రాచలంలో ఈ ఏడాది ఏప్రిల్‌లో శ్రీరామనవమి రోజున జరిగే సీతారాముల కల్యాణానికి ఉపయోగించు తలంబ్రాలను వేంపల్లె అమ్మవారిశాలలో మహిళలందరూ గోటితో వడ్లను వల్చి గోటి తలంబ్రాలను ఆర్యవైశ్య మహిళా మండలి ఆధ్వర్యంలో శనివారం తయారు చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య మహిళా మండల అధ్యక్షురాలు పచ్చిపులుసు ప్రవీణ కిశోర్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

నేడు ప్రముఖ వైద్య నిపుణుల రాక

పులివెందుల : పట్టణంలోని స్థానిక భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(గంగిరెడ్డి ఆసుపత్రి)లో ఆదివారం ప్రముఖ వైద్య నిపుణులు రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. ప్రముఖ న్యూరో సర్జన్ డాక్టర్ క్రాంతికుమార్ మెదడు, వెన్నుముక, నరాలు, తిమ్మిర్లు, వంటి ఒళ్లు నొప్పులకు వైద్య చికిత్సలు అందిస్తారన్నారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9963170177, 08568286189 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

ప్లాస్టిక్ నిషేధాన్ని కచ్చితంగా అమలు చేయాలి



కూల్ డ్రింక్ షాపులో తనిఖీలు చేస్తున్న మున్సిపల్ కమిషనర్

కమలాపురం : పట్టణంలో ప్లాస్టిక్ నిషేధాన్ని కచ్చితంగా అమలు చేయాలని మున్సిపల్ కమిషనర్ పగడాల జగన్నాథ్ తెలిపారు. శనివారం ఆయన పట్టణంలోని పలు దుకాణాలను తనిఖీలు చేశారు. పట్టణ ప్రజలు, వ్యాపారులు, వినియోగదారులు కచ్చితంగా ప్లాస్టిక్ నిషేధాన్ని అమలు చేయాలన్నారు. ప్లాస్టిక్ ప్లేట్లు, కవర్లు, కప్పులు తదితరవి వాడకుండా వాటి స్థానంలో పేపర్ ప్లేట్లు, గ్లాసులు, కప్పులు వాడాలన్నారు. ప్రజలు సహకరిస్తేనే ప్లాస్టిక్ నిషేధాన్ని పూర్తి స్థాయిలో అమలు చేస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న మానవత సంస్థ చైర్మన్ కొండారెడ్డి

పులివెందుల టౌన్ : పట్టణంలోని ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు వద్ద మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో శనివారం శ్రీలక్ష్మీకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మానవత సంస్థ చైర్మన్ కొండారెడ్డి, ఆగ్రో సంస్థ మేనేజర్ సిద్ధారెడ్డిలు ప్రారంభించారు. అలాగే ×దీనబంధు ఆశ్రమానికి కృష్ణమూర్తి బియ్యం బస్తాను వితరణగా అందించారు. కార్యక్రమంలో పెన్షనర్ల సంఘ అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి, మానవత అధ్యక్ష, కార్యదర్శులు జయరాజ్, గంగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బేటీ బచావో.. బేటీ పడావో



బైకు ర్యాలీలో సీడీపీఓ శ్రీలత

పులివెందుల రూరల్ : పట్టణంలో ఐసీడీఎస్ సీడీపీఓ శ్రీలత ఆధ్వర్యంలో శనివారం బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమం నిర్వహించారు. స్థానిక పూలంగళ్లు సర్కిల్ నుండి పాత బస్టాండు వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ భ్రూణ హత్యలను నిర్మూలించాలన్నారు. అలాగే నల్లపురెడ్డిపల్లె ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మెప్మా కమ్యూనిటీ ఆర్గనైజర్ రామాంజనేయులు, ఐసీడీఎస్ సూపర్ వైజర్లు నాగేశ్వరి, సరిత, మాబున్ని స్నేహిత అమృత హస్తం సేవాసమితి అధ్యక్షుడు రాజు, పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం కృష్ణవేణి, మెప్మా ఆర్పీలు, టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

లింగాల : లింగాల సెక్టార్–1లో శనివారం బేటీ బచావో – బేటీ పడావో కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అంగన్‌వాడీ సూపర్‌వైజర్ వెంకటలక్ష్మి హాజరై అంగన్‌వాడీ టీచర్లతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో ఆడపిల్లల ప్రాముఖ్యతను వివరించారు. ఆడపిల్లలను పుట్టనిద్దాం.. ఆడపిల్లలను ఎదగనిద్దామంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ

ఎర్రగుంట్ల : మండలంలోని తిప్పలూరులో శనివారం డీపీఓ రాజ్యలక్ష్మీ లబ్ధిదారులకు పింఛన్లను పంపిణీ చేశారు. ఈఓపీఆర్డీ రంతుల్లయ్య, సిబ్బంది పాల్గొన్నారు. గ్రామాలలో ఎంపీడీఓ వెంకటరమణయ్య పంపిణీ చేశారు.

నూతన సిలబస్‌తో.. టెన్షన్



విద్యార్థులకు పాఠాలు చెబుతున్న ఉపాధ్యాయుడు

జమ్మలమడుగు : ఈ ఏడాది మొదటి సారిగా నూతన సిలబస్ సీబీఎస్‌ఈలో విద్యార్థులు పరీక్షలు రాయబోతున్నారు. విద్యార్థుల్లో అటు ఉపాధ్యాయుల్లో టెన్షన్ మొదలైంది. సిలబస్ కూడా ఎక్కువ ఉండటంతో విద్యార్థులకు స్టడీ అవర్స్ పెట్టి ప్రతి రోజు 12 గంటలకు పైగా తరగతి గదుల్లో పెట్టి చది విస్తున్నారు. ముఖ్యంగా ఫిజిక్స్, లెక్కలు, జీవశాస్త్రం, సోషల్ స్టడీస్‌కు సంబంధించిన సిలబస్ ఎక్కువగా ఉండటంతో ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీ సుకుంటున్నారు. ప్రస్తుతం ప్రీఫైనల్ పరీక్షలు ముగియడంతో విద్యార్థులు రాసిన పరీక్షల ఆధారంగా వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నా రు. కేవలం పరీక్షలు 15 రోజులు మాత్రమే ఉండటంతో విద్యార్థులు పూర్తి స్థాయిలో చదువులో నిమగ్నమయ్యారు.

టాపర్లపై ప్రత్యేక దృష్టి

ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో బాగా చదువుకునే విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించారు. గతేడాది వచ్చిన మార్కుల కంటే ఈ ఏడాది ఎక్కువ మార్కులు సాధించి వచ్చె విద్యాసంవత్సరంలో అడ్మిషన్లు ఎక్కువ చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. గతేడాది జిల్లాలో 594 నుంచి 586 మార్కులు చాలా మంది విద్యార్థులు సాధించారు. దీనిని క్రాస్ చేసేవిధంగా ఉపాధ్యాయులు విద్యార్థులతో కసరత్తులు చేయిస్తున్నారు. దానికి తగ్గట్టుగా ప్రత్యేకంగా పరీక్ష పేపర్లను తయారు చేయించి వారికి పరీక్షలు రాయించారు. వెనుక బడిన విద్యార్థులు ముఖ్యమైన ప్రశ్నలు మాత్రమే చదివించుకుంటున్నారు. ఈ విద్యా సంవత్సరంలో జిల్లాలో మొత్తం 521 పాఠశాలల్లో 23,311 మంది విద్యార్థులు పరీక్షలు రాయబోతున్నారు. అందులో ప్రభుత్వ పాఠశాలలు 304 ఉండగా అందులో 15,333 మంది, ప్రైవేట్ పాఠశాలు 217 ఉండగా అందులో 7978 మంది పరీక్షలకు హాజరు కానున్నారు.

మార్చి 17వ తేదిన పరీక్షలు ప్రారంభం

ఇంటర్మీడియట్ పరీక్షలు మార్చి 1వ తేదిన ప్రారంభమై పరీక్షలు ముగిసిన వెంటనే 17వ తేదీ నుంచి పద వతరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. మార్చి చివరి వరకు పరీక్షలు జరుగనున్నాయి. విద్యార్థులు చదువుకున్న వాటిని మాత్రమే రివిజన్ చేసుకుంటు ఉండాలని ఉపాధ్యాయులు సూచిస్తున్నారు. ఇప్పటి నుంచే విద్యార్థులు ప్రణాళిక బద్ధంగా చదువుకుంటూ ఉండాలి. దానితోపాటు ద్రవపదార్థాలు ఎక్కువ తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

తల్లిదండ్రులు పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలంటూన్న వైద్యులు

పద వతరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల పట్ల తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. వారికి ఎక్కువ ఘన పదార్థాలు కాకుండా ద్రవపదార్థాలు ఇవ్వడంతో పాటు వారికి సమయానికి పౌష్టికాహారం అందేలా చూసుకోవాలి. అనారోగ్యం బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచనలు ఇస్తున్నారు.

సిలబస్ ఎక్కువగా ఉన్నా పూర్తి చేస్తున్నారు



పద వరగతి సోషల్ సిలబస్ ఎక్కువగా ఉంది. డి సెంబర్ చివరి నాటికి పూర్తి చేసి తిరిగి ప్రభుత్వ ఉపాధ్యాయులు రివిజన్ చేయడం జరిగింది. పిల్లలను బాగా చదివిస్తున్నాము. మంచి స్కోరు తెచ్చి ప్రభుత్వ పాఠశాలలు, ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ప్రయత్నం చేస్తున్నాము. ఫలితాలు కూడా బాగా వచ్చె అవకాశాలు ఉన్నాయి.

– గురుకుమార్, సోషియల్ ఉపాధ్యాయుడు

బాగా చదివిస్తున్నారు



పదవ తరగతి పరీక్షల్లో మా ఉపాధ్యాయులు బాగా చదివిస్తున్నారు. సిలబస్ పూర్తిగా అయిపోయింది. లెక్కలు, సైన్సు, ఇంగ్లీషుతోపాటు సోషియల్ సబ్జెక్టులపై ప్రత్యేక శ్రద్ధతో చదివిస్తున్నారు. మా ప్రభుత్వ పాఠశాలలో ప్రైవేట్ పాఠశాలలకు 550కి తగ్గకుండా ఎక్కువ మార్కులు సాధించేవిధంగా చదువుకుంటున్నాము.

– సుప్రజ, జడ్పీ ఉన్నత పాఠశాల, వేపరాల, మైలవరం

బాధ్యతతో ట్రాఫిక్ పోలీస్‌కు సహకరించండి



కమలాపురం క్రాస్ రోడ్డు వద్ద వాహనాల చట్టంపై అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ ప్రతాప్‌రెడ్డి

కమలాపురం : వాహనాలు నడిపే వారు బాధ్యతగా నడపాలని, అలాగే ట్రాఫిక్ పోలీసులకు సహకరించాలని ఎస్‌ఐ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. శనివారం కడప–తాడిపత్రి ప్రధాన రహదారిలో కమలాపురం క్రాస్ రోడ్డు వద్ద ఆయన పోలీస్ సిబ్బందితో కలసి వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన వాహన చోదకులను ఉద్దేశించి మాట్లాడా రు. ఈ రోజు నుంచి వాహనాల నూతన చట్టం అమలులోకి వచ్చిందన్నారు. వాహన చోదకులు లైసెన్స్ లేకుండా నడిపితే రూ.5 వేలు జరిమానా విధిస్తామన్నారు. అలాగే మద్యం తాగి వాహనం నడిపితే రూ.10 వేలు, హెల్మెట్ లేకుండా నడిపితే రూ.1000 జరిమానా విధించడంతో పాటు 3 నెలల పాటు లైసెన్స్ రద్దు చేయబడుందన్నారు. ట్రిపుల్ రైడింగ్‌కు సీట్ బెల్ట్ ధరించక పోతే రూ.1000 చొప్పున జరిమాన విధిస్తామన్నారు. తెలికపాటి వాహనాలు అత్యధిక వేగంగా నడిపితే రూ.1000, మధ్యస్థ వాహనాలైతే రూ.2 వేలు జరిమాన విధిస్తామన్నారు. వాహన చోదకులు బాధ్యతగా వాహనాలు నడపాలనీ, అలాగే ట్రాఫిక్ పోలీస్‌కు సహకరించాలని ఎస్‌ఐ తెలిపారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మోడల్ గ్రామంగా కీర్తిపల్లె ఎంపిక



కీర్తిపల్లెలో పర్యటిస్తున్న జిల్లా అధికారులు

వీరపునాయునిపల్లె : మండలంలోని కీర్తిపల్లె మోడల్ గ్రామంగా ఎంపికైంది. శనివారం జిల్లా స్థాయి అధికారులు కీర్తిపల్లెలో పర్యటించారు. జిల్లా వ్యవసాయ అధికారి అయిత నాగేశ్వర్‌రావు విలేకరులతో మాట్లాడుతూ గ్రామంలోని రైతుల ఆదాయం రెట్టింపు చేసే విధంగా గ్రామాన్ని తీర్చిదిద్దేందుకు కలెక్టర్ కీర్తిపల్లెను మోడల్ గ్రామంగా ఎంపిక చేశారన్నారు. కార్యక్రమంలో డ్వామా పీడీ, పశు సంవర్ధక శాఖ అధికారి శారదమ్మ, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి సుభాషిణి, ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు మేనేజర్ ప్రవీణ్, మార్కుఫెడ్ మేనేజర్ జిల్లా సూక్ష్మ నీటిపారుదల అధికారి చంద్రశేఖర్ రెడ్డి, జిల్లా మత్స్య శాఖ అధికారి, జిల్లా కో ఆపరేటివ్ అధికారి, జిల్లా పట్టు పరిశ్రమ అధికారులు, మండల వ్యవసాయ అధికారి శ్యామ్‌బాబు, రైతులు పాల్గొనారు.

నీటి సమస్య తలెత్తకుండా చర్యలు



ఎస్ఎస్ ట్యాంకు వద్ద మరమ్మతు పనులను చేయిస్తున్న మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్

పులివెందుల టౌన్ : మున్సిపాలిటీకి మంచి నీటి సరఫరా అందించే నక్కలపల్లి సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌లో మోటార్ల మరమ్మతులను శనివారం మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మున్సిపల్ వైస్ చైర్మన్ ఆఫీస్‌లు మరమ్మతులు చేయించారు. మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి ఆదేశాల మేరకు శనివారం వారు మున్సిపల్ కమిషనర్ రాముడు, డీఈలతో కలిసి సమ్మర్ స్టోరేజ్ ట్యాంకును పరిశీలించారు. సకాలంలో ప్రజలకు మంచి నీటిని అందించాలని అధికారులకు సూచించారు. వేసవి సమీపిస్తుండటంతో ప్రజలు ఎక్కడ మంచినీటికి ఇబ్బంది పడకూడదని వారు అధికారులకు సూచించారు.

ఉక్కుకు నిధులు కేటాయించకపోవడం దారుణం

జమ్మలమడుగు : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో జిల్లాకు తీవ్ర అన్యాయం జరిగిందని ముఖ్యంగా యువకులకు భరోసాలేదని, సూపర్ సిక్స్‌లో భాగమైన నిరుద్యోగ భృతి లేదని డీవైఎఫ్‌ఐ జిల్లాకమిటీ సభ్యుడు ప్రసాద్ తెలిపారు. శనివారం స్థానిక ఎన్జీఓ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలకు సంబంధించిన ఏ వాటికి బడ్జెట్‌లో నిధులను కేటాయించలేదన్నారు. వలంటీర్‌లకు ఇచ్చిన హామీని పూర్తిగా మరచిపోయినట్లు ఉందన్నారు. ఉక్కు పరిశ్రమకు నిధులు కేటాయించకపోవడం దారుణం అన్నారు. ఉద్యోగం లేకపోతే నిరుద్యోగ భృతి కింద రూ. 3 వేలు ఇస్తామని చెప్పి ఇప్పుడు ఆ హామీని అమలు చేయకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందన్నారు. రాష్ట్రంలో వలంటీర్ వ్యవస్థను కొనసాగించి వారికి ప్రతినెల రూ. పదివేలు జీతం ఇస్తామన్న హామీని పక్కన పెట్టారన్నారు.

రంజాన్ మాసానికి ఘన స్వాగతం



పెద్ద దర్గాలో నెల వంకను చూస్తున్న పీఠాధిపతి ఫైజుల్ గఫార్ షా ఖాద్రి, భక్తులు

కమలాపురం : పట్టణంలో దర్గా–ఏ–గఫారియా, జహీరియా ప్రాంగణంలో శనివారం సాయంత్రం దర్గా పీఠాధిపతి ఫైజుల్ గఫార్ షా ఖాద్రితో కలసి ముస్లింలు రంజాన్ మాసంను ఘనంగా స్వాగతించారు. మగ్‌రిబ్ నమాజ్ తర్వాత ఆకాశంలో రంజాన్ నెల వంకను చూశారు. అనంతరం బాణా సంచా పేల్చుతూ రంజాన్ మాసంకు ఘన స్వాగతం పలికారు. దర్గా పీఠాధిపతి ఫైజుల్ గఫార్ షా ఖాద్రి, ఆయన సోదరులు దస్తగిరి స్వామి, మౌలానా స్వామి తదితరులు తమ భక్తులతో కలసి రంజాన్ నెల వంకను చూసి ప్రత్యేక దువా చేశారు. ఆదివారం నుంచి ఉపవాస దీక్షలు పాటించాలని ఆయన ముస్లింలకు పిలుపునిచ్చారు. పట్టణంలోని అన్ని మస్జిద్‌లతో పాటు వివిధ గ్రామాల్లో వెలసిన మస్జిద్‌లలో కూడా బాణా సంచా పేల్చి రంజాన్ మాసంకు ఆహ్వానం పలికారు.

భూ సర్వే సక్రమంగా నిర్వహించాలి



తిప్పలూరులో భూసర్వేను పరిశీలిస్తున్న డీపీఓ జీ రాజ్యలక్ష్మీ

ఎర్రగుంట్ల : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన స్వామిత్వ కార్యక్రమంలో భాగంగా గ్రామాలలో ఇళ్లకు సంబంధించి భూసర్వే కార్యక్రమాన్ని సక్రమంగా నిర్వహించాలని జిల్లా పంచాయతీ అధికారి జి.రాజ్యలక్ష్మీ తెలిపారు. శనివారం భూసర్వేను తిప్పలూరు గ్రామంలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతు ఈ భూసర్వేతో ఆస్తికి సంబంధించిన అన్ని వివరాలు పక్కా నమోదు చేయబడుతాయన్నారు. ప్రజలు అపోహలు వీడి భూసర్వేకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ ఎస్.రంతుల్లయ్య, గ్రామ కార్యదర్శి శివ శంకర్‌రెడ్డి, తిప్పలూరు సర్వేయర్ నరసింహ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడండి

తొండూరు : ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించి పర్యావరణాన్ని కాపాడాలని హెల్త్ ఎడ్యుకేటర్ మల్లయ్య తెలిపారు. శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా తొండూరు ప్రాథమిక ప్రభుత్వ మెయిన్ పాఠశాలలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హెల్త్ ఎడ్యుకేటర్ మల్లయ్య, ఈఓపీఆర్డీ సాయి ప్రతాప్‌రెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమణమ్మలు హాజరై మొక్కలు నాటి నీరు పోశారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, మహిళా పోలీసు, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీపీపీలో ప్రారంభమైన వార్షిక బ్రహ్మోత్సవాలు

ఎర్రగుంట్ల : డాక్టర్ ఎంవీఆర్ రాయలసీమ థర్మల్ పవర్ ప్రాజెక్టు వీవీరెడ్డి కాలనీలో వెలసిన శ్రీ భూదేవి, శ్రీదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి దేవాలయ 29వ వార్షిక బ్రహ్మోత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ బ్రహ్మోత్సవాలు ఐదు రోజుల పాటు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. శనివారం ఉదయం ఆలయంలో ప్రధాన కలశస్థాపన నవగ్రహ హోమాలు జరిగాయి. ఆర్టీపీపీ ఎస్‌ఈలు ఉద్యోగులు పాల్గొని అభిషేకాలు పూజలు నిర్వహించారు.

పోలీస్‌స్టేషలో ఓపెన్ హౌస్



విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న సీఐ నరేష్‌బాబు

ఎర్రగుంట్ల : పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు పట్టణ సీఐ నరేష్ బాబు శనివారం తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని పాఠశాలలో చదువుతున్న విద్యార్థినులతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. పోలీస్‌స్టేషన్ పనిచేసే విధానం, స్టేషన్‌లో రికార్డుల నిర్వహణ, మహిళ హెల్ప్‌డెస్క్, అత్యవసర మొబైల్స్ నంబర్లు, ఆయుధాలు మహిళా చట్టాలపై అవగాహన కల్పించినట్లు తెలిపారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి

సింహాద్రిపురం : గ్రామాలలో ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటేనే ఆరోగ్యంగా ఉంటారని ఈఓపీఆర్డీ పద్మనాభరెడ్డి తెలిపారు. శనివారం మండలంలోని పలు గ్రామాలలో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమం పనులు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన ప్రజలకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు వెంకట్రాముడు, విశ్వేశ్వర రావు, తదితరులు పాల్గొన్నారు

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

లింగాల : స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం ప్రాథమిక, ఉన్నత పాఠశాలల విద్యార్థులకు ×వికసిత్ భారత్ⓧ అనే అంశంపై మండలస్థాయి వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో ప్రతిభ చూపిన విద్యార్థులకు ఎంఈఓలు శ్రీనివాసులరెడ్డి, రామకృష్ణయ్యలు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలస్థాయి వ్యాసరచన పోటీలలో ప్రతిభ చూపిన విద్యార్థులకు జిల్లాస్థాయి వ్యాసరచన పోటీలకు ఎంపికయ్యారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఎమ్మార్సీ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

లింగ వివక్షను విడనాడాలి



ఆడపిల్లలు ఉన్న తల్లులకు మొక్కలు అందిస్తున్న అంగన్‌వాడీ సూపర్‌వైజర్ హసీనా

వేముల : ఆడపిల్లలను చదివించాలి, లింగ వివక్షను విడనాడాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ హసీనా తెలిపారు. మండలంలోని రాచకుంటపల్లె అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేటి బాలికే రేపటి అమ్మ అని ప్రతి ఆడపిల్లను శ్రద్ధగా చదివించాలని, ఆహారం, ఆరోగ్యంపట్ల ప్రత్యేక శ్రద్ధ చూపించాలన్నారు. అలాగే బేటీ బచావో బేటీ పడావో గురించి వివరిస్తూ ఆడపిల్లలు ఉన్న తల్లులను ఆదర్శంగా తీసుకుని వారితో మొక్కలు నాటించారు. మహిళలు అన్ని రంగాలలో రాణిస్తున్నారని, ఆడపిల్లలను చులకనగా చూడవద్దని, వారిని ప్రోత్సహించి బాగా చదివించాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

ఘనంగా దిన్నెపాటి గంగమ్మతల్లి తిరునాల



బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ వైఎస్ మనోహర్‌రెడ్డి

పులివెందుల టౌన్ : పట్టణంలోని కదిరి రోడ్డులో వెలసిన దిన్నెపాటి గంగమ్మతల్లి తిరునాల మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గంగమ్మతల్లి అమ్మవారికి శనివారం ఆలయ నిర్వాహకులు వెంకటనారాయణ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం సుంకర బ్రదర్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఒంగోలు గిత్తల సీనియర్ ఎద్దులతో బండలాగుడు పోటీలను మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి ప్రారంభించారు. కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి మొదటి బహుమతికి రూ.లక్ష, వెలమవారిపల్లె గ్రామానికి చెందిన రమేష్‌నాయుడు రెండవ బహుమతి కింద రూ.70వేలు, వెంకటాపురం గ్రామానికి చెందిన కౌన్సిలర్ విజయ్‌నాయుడు మూడవ బహుమతి కింద రూ.50 వేలు అందజేశారు. మైదుకూరుకు చెందిన కుర్రి వెంకటేష్ యాదవ్ ఎద్దులు ప్రథమ స్థానం, నంద్యాల జిల్లా ప్యాపిలి మండలం పీఆర్ పల్లెకు చెందిన నాగయ్య ఎద్దులు రెండవ, మూడవ స్థానాలలో నిలవగా, ప్రొద్దుటూరుకు చెందిన కె.మహబూబ్‌బాషా ఎద్దులు నాల్గవ స్థానంలో నిలిచాయి. సాయంత్రం అమ్మవారి బిందె సేవ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. రాత్రి 8గంటలనుంచి ఒంగోలు ఆనంద్ ఈవెంట్స్ వారిచే శక్తిస్వరూపాలు వేషధారణలు, జ్యోతుల కార్యక్రమం వైభవంగా నిర్వహించారు.

వైభవంగా గంగమ్మ జాతర



పూజలందుకున్న గంగమ్మ తల్లి



బండలాగుతున్న ఎద్దులు

చింతకొమ్మదిన్నె : కొత్తపేట గ్రామంలో వెలసిన గంగమ్మతల్లి జాతర మొదటి రోజు ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. అనంతరం బండలాగుడు పోటీలను నిర్వహించారు. ఆరు జతల ఎద్లు పాల్గొనగా మొదటి బహుమతి గుంటూరు జిలపల్లి గ్రామానికి చెందిన రిసిగ్నితారెడ్డి ఎద్దులు రూ. 80 వేలు, రెండవది ప్రొద్దుటూరుకు చెందిన ద్వార్సల గురువిరెడి ఎద్దులు రూ.60 వేలు, మూడవది ప్రొద్దుటూరు మండలం చౌటపల్లి గ్రామానికి చెందిన మార్త చంద్రఓబుల్‌రెడ్డి ఎద్దులు రూ.40 వేలు నాల్గవది వల్లూరు మండలం గాలివారిపల్లెకు చెందిన ఇందిరెడ్డి రమణారెడ్డి ఎద్దులు రూ.30 వేలు ఐదవది కమలాపురంకు చెందిన కుమార్ ఎద్దులు రూ.20వేలు, ఆరవది ప్రొద్దుటూరు మండలం కామనూరు గ్రామానికి చెందిన శివకాంత్‌రెడ్డి ఎద్దులు రూ.10 వేలు గెలుచుకున్నాయి. వీరికి ఆలయ ఈవో కృష్ణానాయక్ ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు బహుమతులను అందజేశారు. అలాగే పలు సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి.

నేడు మైలు తిరుణాల

రెండు రోజుల జాతరలో భాగంగా ఆదివారం మైలు తిరుణాల ఘనంగా జరగనుంది. సీకేదిన్నె సీఐ శివశంకర్ నాయక్, ఎస్‌ఐ శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో బందోబస్తును ఏర్పాటు చేశారు.

ప్రారంభమైన ఇంటర్ ప్రథమ సంవత్సర పరీక్షలు



పులివెందులలో పరీక్ష కేంద్రం వద్ద ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులు

పులివెందుల టౌన్ : పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల (వైఎస్‌వీఆర్‌ఎం), ప్రభుత్వ జూనియర్ కళాశాల, శ్రీసాయిచైతన్య జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు ప్రారంభమయ్యాయి. శనివారం ఇంటర్ మొదటి సంవత్సర తెలుగు, సాంస్క్రిట్ పరీక్షలతో మొదలయ్యాయి. ఇందుకు సంబంధించి బాలికల జూనియర్ కళాశాలలో 413 మంది హాజరు కావాల్సి ఉండగా.. 13 మంది, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 299 మందికి గానూ 11 మంది, శ్రీసాయిచైతన్య కళాశాలలో 292 మందికి గానూ 10 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఆర్‌ఐఓ వెంకటసుబ్బయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేశామన్నారు.

కమలాపురం : పట్టణంలోని గురుకుల పాఠశాల, పీవీఎస్‌ఆర్‌ఎం జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రాల్లో ఇంటర్ పరీక్షలు నిర్వహించారు. గురకుల కేంద్రంలో 235 మంది విద్యార్థులకు 18 మంది గైర్హాజరైనట్లు చీఫ్ సూపరిటెండెంట్ తులశమ్మ తెలిపారు. అలాగే పీవీఎస్‌ఆర్‌ఎం కళాశాల కేంద్రంలో 243 మంది విద్యార్థులకు 227 మంది హాజరైయ్యారని 16 మంది గైర్హాజరయ్యారని చీఫ్ సూపరింటెండెంట్ వెంకట సుబ్బయ్య తెలిపారు. తొలి రోజు పరీక్షా ప్రశాంతంగా ముగిసింది.

సింహాద్రిపురం : స్థానిక వైఎస్ రాజారెడ్డి ప్రభుత్వ జూనియర్ కాలేజీలో శనివారం ఇంటర్ మొదటి సంవత్సర పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరిగాయని కళాశాల ప్రిన్సిపాల్ స్వర్ణలత తెలిపారు. ఇంటర్ మొదటి సంవత్సర తెలుగు పరీక్షకు 95 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా ఆరు మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఆయన తెలిపారు.

పెండ్లిమర్రి:పెండ్లిమర్రి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం ఇంటర్మీడియట్ మెదటి సంవత్సరం పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని కళాశాల ప్రిన్సిపాల్ ఇందిరా తెలిపారు. 152 మంది విద్యార్థులకు గాను 148 మంది విద్యార్థులు పరీక్షలు రాశారన్నారు.

వర్మీకంపోస్టు నిర్వహణపై శ్రద్ధ వహించాలి



ముద్దనూరులో వర్మీ తొట్లలో వానపాములను వదులుతున్న డీపీవో

ముద్దనూరు : జిల్లాలో చెత్తనుంచి సంపద తయారీ కేంద్రాలను వినియోగంలోకి తెచ్చి వాటిలో వర్మీకంపోస్టు నిర్వహణ, అభివృద్ధిపై శ్రద్ధ వహించాలని జిల్లా పంచాయతీ అధికారిణి రాజ్యలక్ష్మి తెలిపారు. శనివారం ముద్దనూరు మేజర్ పంచాయతీలో ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా ఓ వీధిలోకి వెళ్లి తడి చెత్త పొడి చెత్త వేరు చేయు విధానంపై ఆమె ప్రజలకు అవగాహన కల్పించారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలలో వర్మీకంపోస్టు తయారీకి తగిన చర్యలు చేపట్టాలని తెలిపారు. డీఎస్‌పల్లె రహదారిలో వున్న చెత్తనుంచి సంపద తయారీ కేంద్రంలో డీపీవో వర్మీ తొట్లలో వానపాములను వదిలారు. అనంతరం పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని తనిఖీచేసి, స్థానిక పంచాయతీ కార్యాలయంలో రికార్డులను పరిశీలించి, వందశాతం పన్నులను సకాలంలో వసూలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో మండల విస్తరణాధికారి వీరభద్రుడు, పంచాయతీ ఈవో లక్ష్మీనరసింహులు, రీసోర్స్ పర్సన్ పుల్లారెడ్డి, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.